ప్రజా సమస్యలపై సీపీఐ అలుపెరగని పోరాటం



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రచారి

నాగోలు: నిరంతరం పేదల కోసం పనిచేసే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) అని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రచారి అన్నారు. న్యూనాగోలు కాలనీలో ఎస్‌కే డాంగే భవన్‌లో సరూర్‌నగర్ మండల కార్యదర్శి బాతరాజు నరసింహ అధ్యక్షతన సోమవారం నిర్వహించిన ఎల్‌బీనగర్ నియోజకవర్గం పార్టీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రజా సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. సీపీఐ పార్టీ సిద్ధాంతాలను పాటిస్తూ కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు గుర్తింపు లభిస్తుందని అన్నారు. అనంతరం మన్సూరాబాద్ డివిజన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. కార్యదర్శిగా కందుల సుధాకర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సామిడీ శేఖర్ రెడ్డి,బాతరాజు నరసింహ, ప్రవీణ్‌కుమార్‌గౌడ్, పైమీద పాల్గొన్నారు.

మిర్చి రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

చాదర్‌ఘాట్: మిర్చి రైతుల సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని మార్కెట్ కమిటీ డెరెక్టర్ మస్రత్‌సుల్తానా అన్నారు. సోమవారం మలక్‌పేట్‌లోని మిర్చియార్డులో పర్యటించి అక్కడి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మిర్చి రైతులకు గిట్టుబాటు ధరలు లభించే విధంగా వ్యాపారులతో మార్కెట్ కమిటీ పాలకవర్గం సమావేశం ఏర్పాటు చేస్తోందన్నారు. మార్కెట్‌కు వచ్చే రైతులకు మంచినీటి సౌకర్యం లేదని ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. అలాగే రైతులకు విశ్రాంతి గదులను ఇచ్చేలా చూస్తామన్నారు.



రైతులతో మాట్లాడుతున్న మస్రత్ సుల్తానా

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

మలక్‌పేట: అర్హులందరికి సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల అన్నారు. సైదాబాద్ మండల పరిధికి చెందిన 76 మందికి మంజూరైన షాదీముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను సోమవారం ఆయన పంజేషాలోని క్యాంపు కార్యాలయంలో అందజేసి మాట్లాడారు. పేదింటి ఆడబిడ్డలకు ఈ పథకం ఓ వరం లాంటిదన్నారు. ప్రతి ఒక్కరూ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐలు శ్రీనివాస్‌రెడ్డి, అర్చన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషిచేస్తా

హస్తినాపురం: డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాననని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. శ్రీరమణకాలనీ రోడ్డు నంబర్- 3లో నిర్మించనున్న డ్రైనేజీ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలోని అన్ని ప్రాంతాలలో ప్రజలకు అవసరమైన కనీస వసతులు మంచినీరు, రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలు ఏర్పాటు చేసేందుకు అన్ని విధాల చర్యలు తీసుకుంటామన్నారు. ఆయా ప్రాంతాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో స్థానికులు భాగస్వాములవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న సుజాతనాయక్



ట్రోఫీతో తెలంగాణ జట్టు సభ్యులు

వీల్‌చైర్ బాస్కెట్ బాల్‌లో సత్తా

మన్సూరాబాద్: ఈ నెల 15, 16 తేదీల్లో చెన్నై లో జరిగిన ద్వారకా దాస్ గోవర్ధన్‌దాస్ వైష్ణవి కాలేజీ ఒలింపియాడ్ దక్షిణ స్థాయి వీల్‌చైర్ బాస్కెట్‌బాల్ పోటీల్లో తెలంగాణ జట్టు సత్తా చాటింది. ఫైనల్‌లో తమిళనాడు జట్టుపై 44 గోల్స్ స్కోర్ చేసి బంగారు పతకాన్ని దక్కించుకున్నట్లు జట్టులోని సభ్యుడైన ధారవత్ సురేష్ వివరాలను వెల్లడించారు.

ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



కుంకుమార్చన చేస్తున్న మహిళలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్‌లోని కుర్తాళ పీఠం శ్రీ ప్రత్యంగిరా దేవాలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కుర్తాళ పీఠ ఆస్థాన పండితులు బ్రహ్మశ్రీ మాచవోలు రమేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యంగిరా అమ్మవారికి విశేష 18 రకాల ద్రవ్యాలతో అభిషేకం, దేవత హోమాలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. మహిళలు భక్తిశ్రద్ధలతో శ్రీ లలితా, శ్రీ విష్ణుసహస్రనామ పారాయణలు, మహా నక్షత్ర హారతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సెక్రటరీ మునిపల్లె శ్రీనివాస్, మునిపల్లె సువర్ణ లత, విఠల్ శర్మ, హేమంత్ శర్మ, శ్రీపతి, అన్నపూర్ణ, హేమ, దేవి, హిమబిందు పాల్గొన్నారు.

మలక్‌పేట జోన్ పరిధిలోని కాలనీలు, బస్తీలో పేరుకుపోతున్న వ్యర్థాలతో దోమలు విజృంభిస్తున్నాయి. పేరుకుపోతున్న వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించకపోవడంతో సాయంత్రమైతే చాలు దోమలతో కుస్తీ పట్టాల్సిన దుస్థితి నెలకొందని ఆయా ప్రాంతాల వారు వాపోతున్నారు. కనీసం ఫాగింగ్ అయినా చేపడితే దోమల బెడద కొంత వరకైనా తగ్గుతుందని ఆ దిశగా అధికారులు చర్యలు చేపట్టడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

–దిల్‌సుఖ్‌నగర్





హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీలోని ఓ పార్కులో పెరిగిన కంపచెట్లు



కాలనీలోని కమ్యూనిటీ హాల్ ఎదుట పేరుకుపోయిన వ్యర్థాలు, పిచ్చిమొక్కలు

సమస్యలతో నార్త్‌ఎక్స్‌టెన్షన్

- హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీలో వరదనీటి కాలువలోకి డ్రైనేజీ నీరు
- దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు

హస్తినాపురం: ఎల్‌బీనగర్ హస్తినాపురం డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో వివిధ సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారు. వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసిన వరదనీటి కాలువల్లోకి డ్రైనేజీ మురుగు నీరు వదులుతున్నారని ఆయా ప్రాంతాల వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాలువల్లో డ్రైనేజీ నీరు పారుతుండటంతో భరించలేని దుర్వాసన వస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఈ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు సంబంధిత అధికారులు, నాయకులతో మొర పెట్టుకున్నా పట్టించుకునే నాథులే లేరని వాపోతున్నారు.

పార్కుల్లో వసతుల లేమి..

డివిజన్ పరిధిలోని అనేక ప్రాంతాల్లో ఉన్న పార్కులలో కనీస వసతులు లేక చెత్తా చెదారం, కంప చెట్లు ఏపుగా పెరగడంతో అందులో పాములు సంచరిస్తున్నాయని స్థానికులు భయాందోళనకు గురవుతున్నారు. తమకాలనీతో పాటు ద్వారకాతిరుమల కాలనీ, సాగర్‌ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాలలోని పార్కులలో వీధి దీపాలు లేక చీకట్లు అలుముకుంటున్నాయని గుంతలు, మట్టిదిబ్బలతో నడిచేందుకు వీలు లేని దుస్థితి నెలకొందని ప్రజలు వాపోతున్నారు.కాలనీలలోని కమ్యూనిటీ హాళ్ల పరిసర ప్రాంతాల్లో చెత్తాచెదారంతో నిండి దుర్వాసన వస్తోంది. పేరుకుపోతున్న చెత్త, వ్యర్థాలను ఎప్పటికప్పుడు తరలించకపోవంతో డంపింగ్ యార్డును తలపిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

మురుగుమయంగా వరద కాలువలు..

డివిజన్ పరిధిలోని హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్ కాలనీ, సాగర్‌ఎన్‌క్లేవ్ తదితర ప్రాంతాల్లో రూ. కోట్లలో ఖర్చుచేసి వరద నీటి కాలువలు నిర్మించారు. వరదనీటి కాలువలలోకి డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల నుంచి వచ్చే మురుగునీరు డ్రైనేజీ నీటిని కలుపుతున్నారని దీంతో వరదనీటి కాలువలు మురుగుమయంగా మారి దుర్వాసన వస్తోంది. అంతేకాక దోమల బెడదతో కాలువ పరిసర ప్రాంతాల కాలనీల ప్రజలు అవస్థలు పడుతున్నారు. హస్తినాపురం నార్త్ ఎక్స్‌టెన్షన్ కాలనీలో ఏర్పాటు చేసిన వరదనీటి కాలువలోకి ఇతర కాలనీలలోని మురుగునీరు, డ్రైనేజీ నీటిని, అపార్ట్‌మెంట్‌ల నుంచి వచ్చే డ్రైనేజీ పైపులను కలుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. డ్రైనేజీ నీరు వరదనీటి కాలువలో పారుతుండడంతో దుర్వాసన వస్తున్న కారణంగా తాము ఇళ్లలో ఉండలేకపోతున్నామని ఆయా కాలనీల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జీహెచ్‌ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ ఉన్నతాధికారులు స్పందించి వరదనీటికాలువలో కలిపిన డ్రైనేజీ పైపులైన్లను వెంటనే తొలగించాలని లేకుంటే అన్ని కాలనీలవాసులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయా ప్రాంతాల వారు హెచ్చరిస్తున్నారు.

పార్కును అభివృద్ధి చేయాలి



తమ కాలనీలో ఉన్న పార్కు పూర్తిగా పిచ్చిమొక్కలు ముళ్ల చెట్లతో నిండిపోయింది. పార్కుపై అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టి సారించి సుందరీకరించాలి. పార్కులో పాములు విషపూరితమైన క్రిమికీటకాలు సంచరిస్తున్నాయి. కమ్యూనిటీహాల్ ఉన్న ప్రాంతమంతా చెత్తాచెదారంతో నిండిపోయింది. సంబంధిత అధికారులు స్పందించి పార్కు, కమ్యూనిటీహాల్ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉండేలా చొరవ చూపాలి.

–శ్రీనివారెడ్డి, హస్తినాపురం నార్త్‌ఎక్స్‌టెన్షన్‌కాలనీ అధ్యక్షుడు

దుర్వాసనతో ఉండలేకపోతున్నాం.



సాగర్‌ఎన్‌క్లేవ్‌కాలనీ, నార్త్‌ఎక్స్ టెన్షన్‌కాలనీలో వరదనీటి కాలువలో డ్రైనేజీ మురుగునీరు కలుపడంతో ఆ కాలువ నుంచి వస్తున్న దుర్వాసనతో కాలనీల్లో ఉండలేకపోతున్నాం. కేవలం వర్షపునీరు మాత్రమే వరదనీటి కాలువల ద్వారా పంపుతామని చెప్పి నిర్మాణాలు చేపట్టిన అధికారులు నిర్మాణం పూర్తయ్యాక డ్రైనేజీ మురుగు నీటిని కలిపారు. వరదనీటి కాలువలోకి కలిపిన డ్రైనేజీ కనెక్షన్లను తొలగించాలి.

–వంగూరి చంద్రశేఖర్‌యాదవ్, ప్రధాన కార్యదర్శి

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.11, వంకాయ రూ.18, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.28, కాకరకాయ రూ.32, బీరకాయ రూ.45, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.23, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.21, ఉల్లిగడ్డ రూ.28, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.25, సొరకాయ రూ11, పొట్లకాయ రూ.13, అరటి కాయ రూ.09, చిక్కుడుకాయ రూ.35, చామగడ్డ రూ.43, మునగ రూ.65, కందగడ్డ రూ.70, బీట్‌రూట్ రూ.23, కీర రూ.23, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.35. ఈ ధరలు మంగళవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

ప్రజావాణిలో మూడు ఫిర్యాదులు

చాదర్‌ఘాట్: ప్రజావాణి కార్యక్రమంలో మూడు ఫిర్యాదులు వచ్చాయని డీసీ జయంత్ పేర్కొన్నారు. ఆజంపుర నుంచి పారిశుద్ధ్యంపై, ఓల్డ్‌మలక్‌పేట్ నుంచి ఒక ఫిర్యాదు వచ్చిందని వీటిని ఆయా శాఖల అధికారులకు పంపిచామని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నాగోలు: కొత్తపేట డివిజన్‌లోని నాగేశ్వర్‌నగర్ కాలనీలో శ్రీ దాసాంజనేయ స్వామి దేవాలయంలో సోమవారం అష్టమవార్షిక (8) మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా దాసాంజనేమ స్వామికి నిర్వహించిన ప్రత్యేక పూజల్లో కార్పొరేటర్ నాయికోటి పవన్ కుమార్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఇమ్మడి నారాయణ, విజయ భాస్కర్, నాయకులు మంచి రాజేష్, రాకేష్‌యాదవ్, తోట మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ ఆత్మహత్యాయత్నం

హయత్‌నగర్: భర్తకు అక్రమ సంబంధం ఉందని ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన హయత్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. బీఎన్‌రెడ్డి కాలనీ వినాయక హిల్స్‌కు చెందిన చిత్రం శ్వేత(19)కు రెండేళ్ల క్రితం చిత్రం మహేష్‌తో వివాహం జరిగింది. వారికి 11 నెలల కొడుకు ఉన్నాడు. తన భర్తకు మరో మహిళతో అక్రమ సంబంధం ఉందని భావించిన శ్వేత గత కొంత కాలంగా మానసిక క్షోభకు గురయ్యింది. సోమవారం ఆటో బుక్ చేసుకుని కుంట్లూర్‌లోని నిర్మానుష్య ప్రాంతానికి వెళ్లి కూల్‌డ్రింక్స్‌లో పురుగుల మందు కలుపుకుని తాగింది. గమనించిన స్థానికులు 100కు ఫోన్ చేయగా చికిత్స నిమిత్తం హయత్‌నగర్‌లోని ఓ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు.

పాత నేరస్తుడి రిమాండ్



అర్జున్

నాగోలు: చోరీకి యత్నించిన పాత నేరస్తుడిని ఎల్‌బీనగర్ పోలీసులు రిమాండ్‌కు తరలించారు. డీఎస్సై నరేందర్ వివరాల ప్రకారం..ఎల్‌బీనగర్ భరత్‌నగర్ కాలనీలో నివాసముండే గంపా అర్జున్(20) పాత నేరస్తుడు. మద్యానికి బానిసై దొంగతనాలకు పాల్పడుతున్నాడు. అదే కాలనీలో రాంచరణ్‌గౌడ్ నివాసంలో ఇతర రాష్ట్రాలకు చెందిన కొంతమంది అద్దెకు ఉంటున్నారు. ఈనెల 16న అర్ధరాత్రి అర్జున్ రాంచరణ్‌గౌడ్ ఇంటి ఆవరణ గోడపైకి ఎక్కి లోపలికి ప్రవేశించాడు. అక్కడ లగేజీ బ్యాగుల్లో ఉన్న డబ్బులు, ఇతర సామగ్రి చోరీ చేసేందుకు ప్రయత్నిస్తుండగా వెంటనే మేల్కొని పట్టుకుని పోలీసులకు అప్పగించడానికి కింది అంతస్తుకు తీసుకొస్తుండగా తప్పించుకుని పారిపోయాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సోమవారం అర్జున్‌ను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

మురుగు నీటి సమస్యలు రానివ్వొద్దు



ధ్వంసమైన మ్యాన్‌హోల్‌ను పరిశీలిస్తున్న పవన్‌కుమార్

నాగోలు: కొత్తపేట డివిజన్ సత్యనగర్ కాలనీలో డ్రైనేజీ మురుగు నీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జలమండలి అధికారులకు సూచించారు. సత్యనగర్ కాలనీ అసోసియేషన్ కమ్యూనిటీ హాల్ లైన్‌లో డ్రైనేజీ మ్యాన్‌హోళ్లు ధ్వంసమై మురుగునీరు తాగునీటిలో కలుస్తుందని స్థానికుల ఫిర్యాదు మేరకు సోమవారం ఆయన జలమండలి అధికారులతో కలిసి పరిశీలించారు. మ్యాన్‌హోల్ మరమ్మతు చేసి డ్రైనేజీ మురుగు నీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కోరారు. కార్పొరేటర్ వెంట రమణ, శివరాజ్ పాటిల్, తోట మహేందర్ యాదవ్, నాయికోటి ప్రదీప్ కుమార్ ఉన్నారు.

సబితారెడ్డి చొరవతోనే నిధులు మంజూరు

మహేశ్వరం: తుమ్మలూరు–మహేశ్వరం బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రత్యేక చొరవతోనే 14.20 కోట్ల నిధులు మంజూరయ్యాయని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు గంట వెంకట్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన తుమ్మలూరులో మాట్లాడుతూ.. తుమ్మలూరు గ్రామంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వంలోనే తుమ్మలూరు గేటు(శ్రీశైలం జాతీయ రహదారి) నుంచి మహేశ్వరం మండల కేంద్రం వయా తుమ్మలూరు బీటీ డబుల్ రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే సబితారెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని నిధులు మంజూరు చేయించి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గ్రామంలో ఎలాంటి అభివృద్ధి పనులు జరగలేదని విమర్శించారు. సబితారెడ్డి హయాంలో తుమ్మలూరులో రాజోలు కట్ట మీదుగా సీసీరోడ్డు నిర్మాణం, తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు, సీసీరోడ్లు, డ్వాక్రా భవన నిర్మాణం, మ్యాక్ ప్రాజెక్టులో సబ్ స్టేషన్ నిర్మాణంతో పాటు ఎన్నో అభివృద్ధి పనులు జరిగాయన్నారు.

నేడు తుక్కుగూడకు కేటీఆర్ రాక

తుక్కుగూడ: బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మున్సిపాలిటీలో జరిగే పార్టీ సమావేశానికి ముఖ్య అతిథిగా వస్తున్నట్లు ఆ పార్టీ మున్సిపాలిటీ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు జల్లాల లక్ష్మయ్యయాదవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పుర పరిధిలోని పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

గృహిణి అదృశ్యం



వైష్ణవి

నాగోలు: ఇంట్లో నుంచి బయటకు వెళ్లిన ఓ గృహిణి అదృశ్యమైన ఘటన నాగోలు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..నాగోలు బండ్లగూడ అజయ్‌నగర్ కాలనీలో నివాసముంటున్న బొల్లు రంజిత్ ఇటీవల నిజామాబాద్ జిల్లా, లింగంపేట మండలం, జెండాగల్లికి చెందిన వైష్ణవి(23)తో ప్రేమ వివాహం చేసుకుని అజయ్‌నగర్ కాలనీలో అద్దె ఇంట్లో ఉంటున్నారు. ఈ నెల 16న వైష్ణవి ఎవరికి చెప్పకుండా ఇంట్లో ఉన్న బంగారం, దుస్తులు తీసుకుని వెళ్లింది. సాయంత్రం ఇంటికొచ్చిన రంజిత్‌కు భార్య కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కేసీఆర్ పుట్టిన రోజు వేడుకలు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పుట్టినరోజు వేడుకలను సోమవారం ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో ఘనంగా నిర్వహించారు. గడ్డిఅన్నారం బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వీవీనగర్‌లోని కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. చైతన్యపురి డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయం వద్ద శానిటేషన్ కార్మికులకు చీరలు పంపిణీ చేశారు.పలు ప్రాంతాల్లోని కూడలిల్లో కేక్‌కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. –ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం



నందనవనంకాలనీలోని పాఠశాలలో మొక్కలు నాటుతున్న సత్యంచారి, పద్మానాయక్



కర్మన్‌ఘాట్‌లో వేడుకలు జరుపుకుంటున్న బీఆర్‌ఎస్ నేతలు



శానిటేషన్ కార్మికులకు చీరలు పంపిణీ చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



కొత్తపేటలో మొక్కలు నాటుతున్న సాగర్‌రెడ్డి, లింగాల రాహుల్‌గౌడ్



పార్కులో మొక్కలు నాటుతున్న బీఆర్‌ఎస్ నాయకులు



అల్కాపురి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు పెన్నులు అందజేస్తున్న అరవింద్ శర్మ, నగేష్